రివాల్యుయేషన్ దరఖాస్తులకు ఆహ్వానం

సుభాష్‌నగర్, జనవరి 12 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూలైలో నిర్వహించిన సంగీత నృత్య వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సుభాష్‌నగర్‌లోని శ్రీ జ్ఞాన సరస్వతి సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లామా కోర్సు ఒక్కో పేపర్‌కు రూ. వెయ్యి ఈనెల 18లోగా చెల్లించాలని పేర్కొన్నారు. డబ్బులను డీడీ రూపంలో హైదరాబాద్ పరీక్షల విభాగానికి పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విరాళాలు సేకరించి ఆర్థికసాయం

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సీతాలే రమేశ్

పొతంగల్, జనవరి 12 : ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ కుటుంబానికి సామాజిక సేవకర్త సీతాలే రమేశ్ అండగా నిలిచాడు. మండలకేంద్రానికి చెందిన వృద్ధురాలు వేణుబాయి(80) వారం రోజుల క్రితం మృతి చెందింది. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వాట్సాప్ ద్వారా దాతల నుంచి రూ. 21 వేలు విరాళం సేకరించారు. వాటిని బాధిత కుటుంబాకి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గంట్ల విఠల్, సుదాం నవీన్, పులకంటి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఘనపురం దేవేందర్

సారంగాపూర్, జనవరి 12 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన జడ్పీహెచ్ఎస్ సారంగాపూర్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని హిందీ ప్రచార సభ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఘనపురం దేవేందర్‌ను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా, ప్రధానకార్యదర్శి కాంతికృష్ణ, కోశాధికారి భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు ఎండీ.జమీలుల్ల, ప్రధానకార్యదర్శి కేవీ రమణాచారి అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరికొండ, జనవరి 12 : మండలంలోని కొండాపూర్ గ్రామశివారులో పోలీసులు ఆదివారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు తనిఖీ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి గమనించి, తన టాటా ఏస్ వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. సిబ్బంది వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా నిర్వహించాలి

మోర్తాడ్, జనవరి12: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆదివారం సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

మూగజీవాలను హింసించొద్దు

వేల్పూర్, జనవరి 12: మండలంలోని పడిగెల్ గ్రామంలో పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ పడిగెల్ ఆధ్వర్యంలో అహింసాయుత శాఖాహార ర్యాలీని ఆదివారం నిర్వహించారు. మూగజీవాలను హింసించవద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధ్యాన కార్యక్రమంలో మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ ప్రధాన సలహాదారుడు సుధీర్‌రెడ్డి శాఖాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయికృష్ణారెడ్డి, భూపతిరాజు, తిరుమల గంగారాం, బావయ్య, దయానంద లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, గద్దర్, శ్రీనివాస్, ప్రభాకర్, మల్లయ్య, బాల సాయన్న పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

శక్కర్‌నగర్, జనవరి 12: బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీలో సంక్రాంతి సందర్భంగా గౌడ్స్ కాలనీ సభ్యులు, బజరంగ్‌దళ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లయన్ వేమూరి లక్ష్మి హాజరయ్యారు. ఈ పోటీల్లో 48 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. నాయకులు శ్యాంసుందర్, రాజేశ్వర్, తులసి, ప్రశాంత్, శ్రీనివాస్‌గౌడ్, ఏశాల గంగాధర్, బర్ల పద్మ నాగన్న, చంద్రకిరణ్, మారుతి, గంగాధర్, పాండు, గంగాధర్ పటేల్, రేణుక, సునీత, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన సమతా సైనిక్ దళ్ శిక్షణ

మాక్లూర్, జనవరి12: మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు కొనసాగిన సమతా సైనిక్ దళ్ శిక్షణ ఆదివారం ముగిసినట్లు అంబేద్కర్ సంఘం సభ్యులు తెలిపారు. చివరి రోజు రాజ్యాంగం, చట్టాలపై ప్రజలకు వివరించారు. ఆపదలో ప్రథమ చికిత్స, స్వీయరక్షణలో భాగంగా కర్రలు, లాఠీలు, ఉపయోగించడం, దళ్ విధానం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 50 మంది శిక్షకులు హాజరయ్యారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకులతో పాటు, అంబేద్కర్ సంఘం నాయకులు బండారి రాములు, డీసీ గంగాధర్, తెడ్డు శేఖర్, పుణ్యరాజ్, బోపతి రవి, కర్రెన్న, రుత్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్రకు విద్యార్థులు

వేల్పూర్, జనవరి 12: సంక్రాంతి సెలవుల్లో భాగంగా మండలంలోని కుకునూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో రామప్ప ఆలయం, వెయ్యి స్తంభాల గుడి, భద్రాచలం, ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, అరకు, బొర్రాగుహలు, కైలాసగిరి వైజాగ్ సిటీ, విజయవాడ ప్రాంతాలను సందర్శించనున్నట్లు తెలిపారు. చారిత్రక, సైన్స్‌కు సంబంధించిన విశేషాలు విద్యార్థులు తెలుసుకోనునట్లు హెచ్ఎం హరిచరణ్ తెలిపారు. విజ్ఞాన విహార యాత్రకు సంబంధించి ఉపాధ్యాయుల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తెలుగు ఉపాధ్యాయుడు గంగాధర్‌తోపాటు రవీందర్, చరణ్‌దాస్, సురేశ్, మల్కన్న, శ్రీధర్‌రావు, అపర్ణను కమిటీలో నియమించి, కట్టుదిట్టమైన ఏర్పాట్లతో విజ్ఞానయాత్రకు వెళ్లినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

డిచ్‌పల్లి వద్ద ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న డిచ్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు

బడాపహాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న చందూర్, మోస్రా మండలాల బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జడ్పీమాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఎమ్మెల్సీ కవితతో ధర్పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు

డిచ్‌పల్లి/ ధర్పల్లి/ మోస్రా (చందూర్)/ రుద్రూర్, జనవరి 12 : పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ కవితకు తాజా మాజీ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రెడ్‌కో మాజీ చైర్మన్ ఎస్ఏ అలీం, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శక్కరికొండ కృష్ణ, సీనియర్ నాయకులు అనిల్‌రావు, తెలంగాణ శంకర్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్సీ కవితను ధర్పల్లి బీఆర్ఎస్ నాయకులు నల్ల హన్మంత్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వర్ని మండలంలోని బడాపహాడ్‌కు వచ్చిన కవితకు చందూర్, మోస్రా మండలాల బీఆర్ఎస్ నాయకులు బైక్‌ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. బడాపహాడ్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని రుద్రూర్ మీదుగా కోటగిరికి వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు రుద్రూర్ మండల నాయకులు రుద్రూర్‌లో మంగళ హారతులతో స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు మధు, పుర్గయ్య, ఆర్.పోచయ్య, నీరడి సాయిలు, శివ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో కవితకు స్వాగతం పలుకుతున్న నాయకులు

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం

జిల్లాకేంద్రంలోని గాజులపేట్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ మండలం చీమన్‌పల్లిలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 12 : యువతకు స్ఫూర్తిప్రదాత, దేశ ఔనత్యాన్ని విశ్వ వ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద బోధనలను యువత పాటించాలని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

జిల్లాకేంద్రంలోని గాజులపేట్‌లో ఉన్న వివేకానంద విగ్రహానికి అర్బన్, రూరల్ మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాకేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్, బీసీ సంక్షేమ సంఘం, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రుద్రూర్‌లో ఫుడ్‌సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో 2006-07 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

చేంగల్‌లో స్వామి వివేకానంద జయంతిలో పాల్గొన్న యువకులు

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కరువు

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు

కందకుర్తి వైకుంఠధామం వద్ద నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంక్

రెంజల్, జనవరి 12: మండలంలోని 17 గ్రామాల్లో గత కేసీఆర్ ప్రభుత్వం రూ.13 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన వైకుంఠధామాలు వసతులు లేక వెక్కిరిస్తున్నాయి. చనిపోయిన వారి దాహన సంస్కారాలను నిర్వహించేందుకు ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. దాహన సంస్కారాలకు వచ్చే వారికి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వైకుంఠధామం పరిసరాలు పచ్చగా కనిపించేలా మొక్కలను నాటారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా వనసేవకులతో నీరు పట్టించి కంటికి రెప్పలా కాపాడారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక పాలన పుణ్యమా అని గతేడాది నుంచి వైకుంఠధామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కొన్ని గ్రామాల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ట్యాంకులు, పైపులు, వైకుంఠధామాల వద్ద మరుగున పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వైకుంఠధామాల వద్ద మరుగున పడిన పరికరాలను వినియోగంలోని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

కిరాణా దుకాణంలో చైనా మాంజా విక్రయం

టాస్క్‌ఫోర్స్ టీం దాడి, ఒకరి అరెస్టు

బోధన్, జనవరి 12: పట్టణంలోని అనీసానగర్‌లో ఉన్న ఏఆర్ కిరాణా దుకాణంలో చైనా మాంజా విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడిచేశారు. దుకాణంలో ఎనిమిది చైనా మాంజా బెండళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యజమాని జునైద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకొని, బోధన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది దాడులు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

మాక్లూర్, జనవరి 12: మండలంలోని కల్లెడి జడ్పీహెచ్ఎస్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి హాజరై.. ప్రతిభ చూపిన 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశారని వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18, 19, 20 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హాకీ సంఘం ప్రధానకార్యదర్శి రమణ, ఎన్ఐఎస్ కోచ్ ఎండీ జావిద్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, సుమన్, కిశోర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

యువకులను సన్మానిస్తున్న చౌట్‌పల్లి గ్రామస్తులు

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం

మోర్తాడ్, జనవరి 12: వివిధ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన 12 మంది యువకులను చౌట్‌పల్లిలో ఎంప్లాయీస్ అసోసియేషన్ చౌట్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సంజీవ్, దామోదర్, శంకర్, రాజేశ్వర్, నర్సయ్య, జ్ఞానేశ్వర్, రమేశ్, కిషన్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

మోర్తాడ్, జనవరి 12: పాలెం గ్రామానికి చెందిన మల్లూరి రాజన్న(49) గ్రామ శివారులోని పెద్దవాగులోకి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడని ఎస్సై విక్రమ్ ఆదివారం తెలిపారు. పాలెం శివారులో పెద్దవాగులో మృతదేహాన్ని గుర్తించి బయటికి తీసి పోస్టుమార్టానికి పంపినట్లు చెప్పారు. రాజన్న చెల్లెలు సుంకరి లింగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కమ్మర్‌పల్లి జడ్పీహెచ్ఎస్ 2002 - 03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

భీమ్‌గల్ మండలం చేంగల్ జడ్పీహెచ్ఎస్ 1990- 2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

మోర్తాడ్/ భీమ్‌గల్, జనవరి 12: కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో చదివిన 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు కమ్మర్‌పల్లి పద్మశాలీ కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు రుక్మయ్య, విశ్వనాథ్, రాజేశ్వర్, ప్రవీణ్‌ను సత్కరించారు. పూర్వవిద్యార్థులు లోలపు సుమన్, పార్శపు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వంగరి రవి, సత్య కిశోర్, గణేశ్, సాగర్, నరేశ్, గోపిడి మహేశ్, తిరుపతి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని చేంగల్ ప్రభుత్వ పాఠశాలలో 1990-2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

బాల్కొండలో నేడు ఎమ్మెల్యే వేముల పర్యటన

మోర్తాడ్, జనవరి 12: బాల్కొండ నియోజకవర్గంలో మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మెండోరా మండల కేంద్రంలో రూ.40 లక్షలతో నిర్మించిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. గోదాదేవి కల్యాణం, పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో గంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించే పూజల్లో పాల్గొననున్నారు.

జీజీహెచ్ ఘటనలపై ప్రభుత్వం స్పందించాలి

- సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకుడు సుధాకర్

ఖలీల్‌వాడి/ మోర్తాడ్, జనవరి 12 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో తరచూ జరుగుతున్న వివాదాస్పద ఘటనలపై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కోటగల్లీలోని ఎన్ఆర్.భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎం.సుధాకర్ మాట్లాడారు. జీజీహెచ్‌లో తరచూ వివాదాస్పద ఘటనలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తీవ్ర అనారోగ్యంతో దవాఖానకు వస్తే సిబ్బంది స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కలెక్టర్ సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోదావరి, సంధ్యారాణి, గణేశ్, సాయిబాబా, నర్సక్క, అశోక్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ దవాఖానపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు సారా సురేశ్ డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లిలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దవాఖానలో పోస్టులు భర్తీ చేయాలని, దవాఖానను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ ప్రజాప్రతినిధులు

నవీపేట, జనవరి 12: మండలంలోని నాళేశ్వర్‌లో శ్రీ రాజరాజేశ్వర క్రీడా మహోత్సవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వీడీసీ సభ్యులతో కలిసి తాజా మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నెల రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది వీడీసీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీడీసీ సభ్యులు రమేశ్, రాజేందర్, సల్ల మహేశ్, చిన్నదొడ్డి ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

విజేతలకు బహుమతిని అందజేస్తున్న ఎస్సై, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

మోర్తాడ్, జనవరి 12: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కొనసాగిన సుంకెట రవిరెడ్డి స్మారక క్రికెట్‌టోర్నీ ముగిసింది. మెండోరా టీం విజేతగా, కమ్మర్‌పల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఎస్సై అనిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మండల యాదవ కమిటీ ఎన్నిక

మాక్లూర్, జనవరి12: మండలంలోని బోర్గాం (కే) గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల యాదవ కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మేడిద గంగాధర్ తెలిపారు. అధ్యక్షుడిగా సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా ఉరడి మల్లేశ్, సలహాదారులుగా గోవూరి ఒడ్డెన్న, బొల్లారం నర్సయ్య, కోశాధికారిగా ఆర్జి నగేశ్, యూత్ విభాగం అధ్యక్షుడిగా ఇదులాయి సుమన్, ప్రధానకార్యదర్శిగా మాముళ్ల రవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపూరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బొర్రహనుమాన్ ఆలయ నూతన కార్యవర్గం..

భీమ్‌గల్, జనవరి 12: పట్టణంలోని బొర్ర హనుమాన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలం రవి, ఉపాధ్యక్షుడిగా రావుట్ల హరీశ్, కోశాధికారిగా అరుణ్‌ని ఎన్నికయ్యారు.

కమ్మర్‌పల్లిలో నేడు ముగ్గుల పోటీలు

మోర్తాడ్, జనవరి 12: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మండపంతో సోమవారం పద్మశాలీ మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ముగ్గులకు కావాల్సిన సామగ్రిని తెచ్చుకోవాలని సూచించారు.

కమ్యూనిస్టు నాయకుడు సాయిలుకు నివాళి

ఆర్మూర్‌టౌన్, జనవరి12: పట్టణంలోని సీపీఐఎంఎల్ కార్యాలయంలో కమ్యూనిస్టు నాయకుడు శావులం సాయిలు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సాయిలు చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.ప్రభాకర్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

మొరం ట్రాక్టర్ పట్టివేత

రెంజల్, జనవరి 12: మండలంలోని దూపల్లి గ్రామ శివారులో మొరం ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అనుమతి లేకుండా మొరాన్ని తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జరిమానా కోసం సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బోధన్, జనవరి 12 : బోధన్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీ శరత్‌రెడ్డి ప్రారంభించారు. ఐవీ పాత్ డయాగ్నోస్టిక్ సెంటర్ సహకారంతో 164 మందికి షుగర్ టెస్ట్‌లు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్యజ్యోతి, ట్రస్ట్ ప్రతినిధి ఎంఎఫ్ రాజు, కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, కేవీ సత్యనారాయణ (సత్యం), డాక్టర్ సునీల్‌కుమార్ చౌదరి, బోధన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.